క్లుప్తంగా

వివాదంపై పోలీసుల విచారణ

కోట: కోట క్రాస్ రోడ్డులో బుధవారం వర్షపు నీరు బయటకు పంపే క్రమంలో తీసిన కాలువ వివాదానికి కారణమైంది. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు రైస్ మిల్లు యజమాని జేసీబీతో కాలువ తీశారు. దీంతో ఆ నీరు తమ దారిలోకి వస్తోందని మరో వర్గం వారు అడ్డు చెప్పడంతో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. మా అనుమతి లేకుండా కాలువ ఎలా తవ్వుతారని, దాన్ని పూడ్చాల్సిందేనని పట్టుబట్టడంతో వివాదం పోలీసుల వరకు వెళ్లింది. ఎస్ఐ పవన్ కుమార్ అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారితో మాట్లాడారు. చివరకు తవ్విన కాలువను పూడ్చివేయడంతో వివాదం సద్దుమణిగింది.

కండలేరులో 33.157 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 33.157 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు వరద కాలువ నుంచి 5,600 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 11,500 క్యూసెక్కుల నీరు చేరుతోందని పేర్కొన్నారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 500, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పునరావాసానికి 109 మంది తరలింపు

తడ: తుపాను ప్రభావంతో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న 109 మందిని అధికారులు తడ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పురావాస కేంద్రానికి తరలించారు. వారికి వసతి, ఆహారం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఆ కేంద్రాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం రాత్రి వరకు గాలుల తీవ్రత పెద్దగా లేకపోవడంతో తడలో కొంత ప్రశాంత వాతావరణం నెలకొంది. తుపాను తీరం దాటనున్న నేపథ్యంలో బుధవారం రాత్రి నుంచి పరిస్థితి ఎలా మారనుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సేవల్లో ఏర్పడే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలనే విషయమై సీజీఎం కే ఆదిశేషయ్య, ఈఈ వై.శ్రీనివాసులు, డీఈ ఆర్.శేఖర్, ఏఈ మురళీ విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించారు.

ఫల సరుకుల పంపిణీ



వృద్ధులకు ఫల సరుకులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పేద వృద్ధులకు బుధవారం లయన్స్ క్లబ్ గూడూరు వైజీపీ ప్రనిధులు ఫల సరుకులు పంపిణీ చేశారు. గూడూరులోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడారు. ప్రస్తుతం తుపాను కారణంగా కొంత మంది సరుకులు తీసుకునేందుకు రాలేకపోయారని, వారి ఇంటికే సరుకులు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. క్లబ్ ప్రతినిధులు సుబ్రమణ్యం యాదవ్, ఆర్వీరావ్, మురళీనాయుడు, గోపీనాథ్‌రెడ్డి, శ్రీనుయాదవ్, పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.25 వేల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు ఇస్తున్న శ్రీరామ రక్ష సేవా సంఘం సభ్యులు

గూడూరు రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం బుధవారం గూడూరులోని శ్రీరామ రక్ష సేవా సంఘం సభ్యులు సీఎం సహాయ నిధికి రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు చిట్టిబాబు, వైహెచ్‌డీ పవన్‌కుమార్, చంద్రశేఖరరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జీకే గురగుహ, శ్యామ్‌సునందర్‌రాజు, శ్రీకంఠి రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

నాయుడుపేట టౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగలో బుధవారం వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిమ్మాజికండ్రిగ, చిగురుపాడు తదితర గ్రామాలకు చెందిన పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి చిన్న పిల్లల వైద్యులు మాల్యాద్రి, గైనకాలజిస్ట్ దీప్తి, డాక్టర్ సంపత్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్ని పిల్లలకు పౌష్టికాహార కిట్లను సంస్థ పీఆర్వో సురేంద్ర పంపిణీ చేశారు.

కోట: విద్యానగర్‌లో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని చుట్టుముట్టిన వరదనీరు



దొరవారిసత్రం: పాలకాలువ నీటి ఉధృతితో వెదురుపట్టు రోడ్డులో మునిగిపోయిన బ్రిడ్జి, దక్కిలి: ఉధృతంగా ప్రవహిస్తున్న కైవల్యా నది





పొంగుతున్న కాలువలు



దొరవారిసత్రం: నేలపట్టు సమీపంలో పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- అప్రమత్తమైన అధికారులు
- కాలువలు, నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటన
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

కోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తహసీల్దార్ జయజయరావు బుధవారం కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, గున్నంపడియ, వావిళ్లదొరువులో పర్యటించారు. వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని తుపాను షెల్టర్లకు, సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద తాకిడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని వీఆర్వోలను ఆదేశించారు. తుపాను ప్రభావంతో మండలంలో గడిచిన 24 గంటల్లో 98 మి.మీల వర్షం కురిసినట్లు తహసీల్దార్ తెలిపారు. విద్యానగర్‌లోని ప్రకాశంకాలనీ, ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యానగర్‌లో విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం చుట్టూ వరదనీరు చేరింది.

దొరవారిసత్రంలో

దొరవారిసత్రం: భారీ వర్షాలకు మండలంలోని కుప్పారెడ్డిపాళెం, పూలతోట గ్రామ సమీపంలో ఉన్న పాలకాలువ, కన్నాకాలువ జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో కుప్పారెడ్డిపాళెం నుంచి వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాళెం గ్రామాలకు, పూలతోట నుంచి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దొరవారిసత్రం, మేలుపాక, మినమనముడి, అయ్యపాళెం పోలిరెడ్డిపాళెం గ్రామాలకు వెళ్లే మార్గాల్లో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జీల్లో భారీగా నీరు నిలిచింది. స్థానిక రెవెన్యూ అధికారులు, ఎస్ఐ అజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని ప్రజలు అటు వైపు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ కొత్తపల్లి, పూలతోట, కట్టువాపల్లి, వేటగిరిపాళెం తదితర గ్రామాల్లో పర్యటించారు. పలు గ్రామాల్లోని పంట పొలాలు వర్షపునీటితో నిండిపోయాయి.

సైదాపురంలో..

సైదాపురం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఆమె బుధవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎస్ఐ క్రాంతి కుమార్‌తో కలిసి ఊటుకూరు, పాలూరు, కలిచేడు గ్రామాల్లో పర్యటించారు. పాలూరు గిరిజనకాలనీ వాసులతో మాట్లాడారు. ఊటుకూరు సమీపంలో ఉన్న మాలేరు వాగు నీటి ప్రవాహన్ని పరిశీలించి వాగుకు అడ్డంగా ఉన్న చెట్లను యంత్రాల సహాయంతో తొలగించారు. కలిచేడు చెరువును ఇరిగేషన్ ఏఈ, డీటీతో కలిసి పరిశీలించారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: భారీ వర్షానికి కలవకూరు చెక్ డ్యామ్, పాలచ్చూరు మామిడికాలువలో నీటి ఉధృతి పెరిగింది. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి బుధవారం ఎంపీడీవో ప్రమీలారాణి, ఎస్ఐ నాగరాజుతో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. అక్కగారిపేట వద్ద జాతీయ రహదారిలో ఉన్న అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. స్వర్ణముఖి నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. పునబాక దళిత కాలనీకి చెందిన యానాది చిన్నయ్య, రమేష్ పూరిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

నష్టాలు లేకుండా చర్యలు

దక్కిలి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం ఎస్ఐ శివశంకర్‌తో కలిసి మాటుమడుగు, లింగసముద్రం, పాతనాలపాడు(కమ్మవారిపల్లి), అత్తల సిద్దవరం గ్రామాల్లో ఉన్న వాగులు, వంకలను పరిశీలించారు. కైవల్యా నది నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలను నిలిపివేశారు. నదికి ఇరువైపులా ముళ్ల కంచెను ఏర్పాటు చేయించారు. దక్కిలిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 71.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం): తుపాను ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. ఎంపీడీవో వినీల్‌కుమార్ బుధవారం హస్తకావేరి ఎస్టీకాలనీలో పర్యటించారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని గిరిజనులకు సూచించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వెంకటగిరి పట్టణంలోని సవారిగుంట, బజారువీధి, మార్కెట్‌వీధితో పాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైవల్యానది, గొడ్డేరువాగు ప్రవహిస్తున్నాయి. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: అల్పపీడనం ప్రభావంతో నాయుడుపేటలో ఎడతెరిపిగా కుండపోత వర్షం కురుస్తోంది. పట్టణంలోని గరిడీవీధి, రావువారి వీధి, రాజ గోపాలపురం తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. మురుగు రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లపై నిలిచిన వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

మామిడి కాలువ ఉధృతం

ఓజిలి: తుపాను ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పున్నేపల్లి వద్ద ఉన్న మామిడి కాలువ పొంగి పొర్లుతోంది. వరద నీరు కాజ్‌వేపైకి చేరడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. పున్నేపల్లి–నెమళ్లపూడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేపై ఎవరూ వెళ్లకుండా ఆర్ఐ విజయ్‌కుమార్, వీఆర్వో డిల్లెయ్య ముళ్లకంప వేసి పోలీసులు, తలారిని గస్తీ పెట్టారు. గ్రద్దగుంట, నెమళ్లపూడి ఎస్టీకాలనీల్లోని గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతి కల్పించారు. మండలంలోని పరిస్థితులను తహసీల్దార్ పద్మావతి, ఎస్ఐ స్వప్న పర్యవేక్షిస్తున్నారు.









దొరవారిసత్రం: కన్నాకాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయుడుపేట టౌన్‌లో మామిడికాలువ ప్రవాహం, సైదాపురం: పాలూరు గిరిజన కాలనీ వాసులతో చర్చిస్తున్న తహసీల్దార్, ఓజిలి: పున్నేపల్లి వద్ద గస్తీ ఉన్న పోలీసులు









పెళ్లకూరు: కలవకూరు వద్ద స్వర్ణముఖినది ప్రవాహం, పెళ్లకూరు: మామిడి కాలువ వద్ద ముళ్లకంప అడ్డుగా వేసిన అధికారులు, పెళ్లకూరు: పునబాక దళితకాలనీలో దెబ్బతిన్న పూరిల్లు, దక్కిలి: మాటుమడుగు వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు



సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనా

గూడూరు రూరల్: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గూడూరు డివిజన్‌లోని అన్ని మండలాల అధికారులను అప్రమత్తంచేసి ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. నవంబర్ కోటాకు సంబందించిన బియ్యం, చక్కెరను రేషన్ దుకాణాలకు పంపించామని, అత్యవసరం అనుకుంటే వాటిని ప్రజలకు పంపిణీ చేసేలా చర్యలు చేపడతామని వివరించారు. భారీ వర్షానికి ఎవరైనా ఇబ్బంది పడుతుంటే కంట్రోల్ రూమ్‌కు 8624-252807, 7013483056 నంబర్లకు సమాచారం ఇస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని మత్స్యకారులు సముంద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని, ప్రజలు అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసం

చిల్లకూరు: భారీ వర్షానికి పొన్నవోలులోని పసల కోటయ్య ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై మంగళవా రం రాత్రి పిడుగు పడింది. దీంతో ఆ ఇంటిలోని ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటి పైకప్పు కొంతమేర దెబ్బతినింది. ప్రాణ నష్టం వాటిల్లలేదని తహసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చన్నారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ కేంద్రాలు



అధికారుల సమీక్షలో ఈఈ వై.శ్రీనివాసులు

నాయుడుపేట టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ వై.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా నాయుడుపేట డివిజన్ పరిధిలోని అన్ని సబ్ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు 73826 23178కు ఫోన్ చేస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతామన్నారు. నాయుడుపేట సబ్ డివిజన్‌కు సంబంధించి 83309 41205కు కూ ఫోన్ చేయవచ్చన్నారు. అంతకుముందు ఆయన సీజీఎం కె.ఆదిశేషయ్య, సీఎండీ కె.సంతోషరావు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

వేడుకగా గంధోత్సవం



గంధాన్ని తీసుకొస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని చిన్నదర్గా వద్ద వెలసిన హజరత్ మాబుసుభాని గంధోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా చేపట్టారు. పట్టణంలోని గరిడీ వీధిలో ఉన్న పఠాన్ అబ్బాస్, సుభహాన్ ఇంటి నుంచి గంధాన్ని నిషాన్ జెండాలతో తీన్ మార్ బ్యాండు మేళాలు, బాణసంచా వేడుకలతో ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. మాబుసుభాని జెండాలను ప్రతిష్ఠించి ఫాతేహా నిర్వహించారు. గంధాన్ని పంచిపెట్టారు.

సూళ్లూరుపేటలో 220.6 మి.మీల వర్షం



ప్రవహిస్తున్న కాళంగి నది

సూళ్లూరుపేట రూరల్: తుపాను ప్రభావంతో సూళ్లూరుపేట మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. బుధవారం నాటికి 220.6 మి.మీల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ నరసింహారావు తెలిపారు. కాళంగి నది, నెర్రికాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట శివారు, లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. నీరు లేక ఎండిపోయిన 68 పీఆర్, పెద్ద చెరువులు సగానికి పైగా నిండాయి. తుపాను బుధవారం రాత్రి తీరం దాటే అవకాశం ఉండడంతో ఆర్డీవో కిరణ్మయి సూళ్లూరుపేట, తడ మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. ముందస్తుగా తడ, సూళ్లూరుపేటలోని వట్రపాళెం ప్రాంతానికి చెందిన 200 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది.

స్వర్ణముఖి నది పరిశీలన

నాయుడుపేట టౌన్: భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువ నుంచి స్వర్ణముఖి నదికి నీరు వస్తోంది. మున్సిపల్ కమిషనర్ బుధవారం అధికారులతో కలిసి నదిని పరిశీలించారు. నీటి ప్రవాహంలో బోర్లు, తాగునీటి పైపులు కొట్టుకుపోకుండా చర్యలు చేపట్టారు. మండలంలోని మామిడి కాలువలో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సీఐ బాబీ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని అటువైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.


మినీ వ్యాను ఢీకొని దంపతులకు గాయాలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఎస్‌కేఎల్ఎస్ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం రాత్రి బైక్‌ను మినీ వ్యాను ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం పూలతోట పంచాయతీ చవటకండ్రిగకు చెందిన కె.బాలరామయ్య, అతని భార్య ప్రభావతమ్మ బైక్‌లో నాయుడుపేటకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారిపై కూరగాయల లోడుతో వస్తున్న మినీ వ్యాను ఢీకొంది. దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైవే మొబైల్ పోలీసులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రభావతమ్మను నెల్లూరు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

తీర ప్రాంత ప్రజలకు రక్షణ కరువు

ప్రతిఏటా అక్టోబర్, నవంబర్ నెలల్లో సముద్రంలో ఏర్పడే తుపానులతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల ప్రజలు చిగురాటుకులా వణికిపోవడం సర్వసాధారణంగా మారింది. భారీ వర్షం కురిసి ఇళ్లను వరద నీరు ముంచెత్తితే తల దాచుకునేందుకు బడి, గుడి తప్ప మరో పునరావాసం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు మారినా, ప్రభుత్వం ఎన్ని వచ్చినా తమకు సరైన పునరావాసం కల్పించడం లేదని తీర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బడి, గుడిలోనే పునరావాసం
- శిథిలావస్థలో రక్షిత భవనాలు
- పట్టించుకోని అధికారులు



కొమరావారిపాళెంలో శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్

చిల్లకూరు మండలంలో తుపాను షెల్టర్లు	:	9
కోట మండలంలో ఉన్న షెల్టర్లు	:	6
వాకాడు మండలంలోని షెల్టర్లు	:	11
చిట్టమూరులో తుపాను షెల్టర్లు	:	4



చిల్లకూరు మండలం పునుగుంటపాళెంలో ఉపయోగంలో లేని తుపాను షెల్టర్

చిల్లకూరు: చిల్లకూరు, వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లోని పలు గ్రామాలు సముద్ర తీరానికి ఆనుకుని ఉన్నాయి. తుపానులు వచ్చిన సందర్భంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 40 ఏళ్ల క్రితం రక్షిత భవనాలు నిర్మించారు. వాటి ఆలనా పాలన గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. సమీపంలో ఉండే గిరిజనులను సైతం వాటిలో ఉంచలేని స్థితికి చేరుకున్నాయి. తుపాను సమయంలో ఆయా గ్రామాల్లోని వారిని బడి, గుడికి తరలించి పునరావాసం ఏర్పా టు చేయాల్సి వస్తోంది. చిల్లకూరు మండలంలో మోమిడి, పునుగుంటపాళెం, పోసినవారిపాళెం, కొమరావారిపాళెం, వేళ్లపాళెం, తూర్పుకనుపూరు, బల్లవోలు, అద్దెపల్లి, వరగలి గ్రామాల్లో సుమారు 40 ఏళ్ల క్రితం తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఒక్కటి కూడా ఉపయోగంలో లేకుండా పోయాయి. అలాగే కోట మండలంలోని గోవిందపల్లి, కొత్తపట్నం, కర్లపూడి, సిద్ధవరం, గోవిందపల్లిపాళెం, శ్యామసుందరపురం, వాకాడు మండలంలో లైట్ హౌస్(ఓడపాళెం), మొనపాళెం, చినతోట, మూలపడవ, దుగ్గరాజపట్నం, పులింజేరివారిపాళెం, శ్రీనివాసపురం, తూపిలిపాళెం, అందలమాల, చీమలపాడు, పామంజి, కొండూరుపాళెం, చిట్టమూరు మండలంలోని పిట్టివానిపల్లి, బురదగాలికొత్తపాళెం, గొల్లపాళెం, ముక్కిడిపాళెంలో నిర్మించిన తుపాను రక్షిత భవనాల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విపత్తుల నిర్వహణ సంస్థల ద్వారా నిధులు సాధించి తుపాను రక్షిత భవనాలను బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షపు నీటి తొలగింపునకు ప్రత్యేక చర్యలు



కాలువలో చెత్తను తొలగిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వెంకటగిరి రూరల్ మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం చిన్నన్నపేట, కళవలపూడి, ఉప్పరపల్లి, యాతలూరు, వల్లివేడు గ్రామాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో కాలువలు చేసి పంట కాలువ ద్వారా చెరువులకు మళ్లించారు. ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులను ఆదేశించారు.

ఉప్పటేరును పరిశీలించిన ఎంపీడీవో



తిప్పగుంటపాళెం వద్ద ఉప్పటేరును పరిశీలిస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

చిల్లకూరు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ఉప్పటేరును బుధవారం ఎంపీడీవో గోపి పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉప్పటేరు పొంగితే తిప్పగుంటపాళెం గ్రామస్తులు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ ఉంటే వారిని ముందస్తుగా బయటకు తీసుకురావాలని తెలిపారు. బయట వ్యక్తులు గ్రామంలోకి వెళ్లకుండా పొలిమేరలో ఉండి పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సిరాజ్, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, వేణుగోపాల్‌నాయుడు, రాజా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.